వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 107 ఆదివారం | 22 అక్టోబర్ 2023 | పేజీలు : 04 | వెల రూ. 5



# బతుకమ్మా.. బతుకమ్మా..
# మాతల్లీ బంగారు.. బతుకమ్మ





ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి అందులో గౌరమ్మను ఏర్పాటు చేసి భక్తితో కొలిచారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలను అందంగా తయారు చేయడంలో మహిళలు పోటీ పడ్డారు. ఈ పండగ తెలంగాణ ఆడ బిడ్డలకు ఎంతో ప్రత్యేకమైన పండగ. గునుగు, తంగేడు, అడవి చేమంతి, కట్లపూలు, గడ్డి పూలు ఇలా రకరకాల పూలతో బతుకమ్మను అలంకరించారు. బతుకమ్మ సంబరాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నగరంలోని రంగ సముద్రం, చిన్న వడ్డేపల్లి చెరువు, బెస్తం చెరువు, కాశీబుగ్గ (పద్మ నగర్), ఉర్సు దర్వాజ, శాంతి నగర్, శివ నగర్ బతుకమ్మ కుంట, బంధం చెరువు, పద్మాక్షి గుండం తదితర మొత్తం 14 ప్రాంతాల్లో బతుకమ్మ ఆడుకునేలా ఏర్పాట్లు చేశారు. బతుకమ్మ..బతుకమ్మ ఉయ్యాలో అంటూ మహిళలు పాడిన పాటలు ఆయా ప్రాంతాల్లో మారుమ్రోగాయి. కోలాటాలు ఆడారు. పలు ప్రాంతాల్లో బతుకమ్మ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వేలాదిగా తరలి వచ్చే ఆడపడుచుల కోసం ప్రభుత్వం ఎలాంటి వసతులు కల్పించకపోయినా స్థానిక ఉత్సవ కమిటీలే ముందుండి భారీ ఎత్తున ఏర్పాట్లు చేశాయి. రవాణా సౌకర్యం, లైటింగ్, తాగునీటి వసతి, తదితర సౌకర్యాలన్నీ కమిటీలే సమకూర్చాయి. తెలంగాణ పండువగా చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం చెరువుల్లో కనీసం గుర్రపు డెక్క కూడా తొలగించకపోవడం గమనార్హం. చెరువంతా గుర్రపు డెక్క నిండుకోవడంతో బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేసేందుకు మహిళలు పడరాని పాట్లు పడ్డారు. - వరంగల్ వాయిస్, డెస్క్
























